క్లుప్తంగా

సీఎం పర్యటనను విజయవంతం చేయాలి

పెద్దపంజాణి: చిత్తూరు జిల్లా కేంద్రంలో ఈనెల 4వ తేదీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనను విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బాగారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. మండలంలోని ప్రతి పంచాయతీ నుంచి అధిక సంఖ్యలో ప్రజాప్రతినిధులు, డ్వాక్రా మహిళలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరై జయప్రదం చేయాలని కోరారు.

నేడు గడప గడపకూ..

గంగవరం: మండలంలో సోమ, మంగళ వారాలు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంకటేగౌడ పాల్గొంటారని ఎంపీడీవో తాజ్‌మస్రూర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జీడిమాకులపల్లె సచివాలయ పరిధిలోని గ్రామాల్లో ఈ కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. సోమవారం ఉదయం 9.30 గంటలకు జీడిమాకులపల్లెలో సచివాలయ భవనం, ఆర్‌అండ్‌బీ రోడ్డు, సీసీ రోడ్డును ప్రారంభించిన అనంతరం కార్యక్రమం ప్రారంభమవుతుందని తెలిపారు.

నేడు చారాలలో జగనన్న సురక్ష

చౌడేపల్లె: మండలంలోని చారాల సచివాలయం వద్ద సోమవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ రామమూర్తి తెలిపారు. ప్రజల సమస్యలను తెలియజేయడంతోపాటు, 11 రకాల ధ్రువీకరణ పత్రాలను పొందవచ్చునన్నారు.

భగవద్గీత పఠనంతో మంచి లక్షణాలు



ప్రచారంలో సేవా సమితి సభ్యులు

గంగవరం: భగవద్గీత చదివితే మానవుడు ఎలా నడుచుకోవాలో తెలుస్తుందని, భగవద్గీతను ప్రతి ఒక్కరూ పఠించాలని త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి సభ్యులు పేర్కొన్నారు. మండలంలోని బండమీద జరావారిపల్లెలో ఆదివారం ఇంటింటా హిందూ ధర్మ ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు రచించిన త్రైత సిద్ధాంత గ్రంథాలను ప్రచారం చేశారు. భగవద్గీత ఎందుకు చదవాలో వివరించారు. కమిటీ అధ్యక్షుడు, సభ్యులు భాస్కర్, బాలాజీ, హేమంత్, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

పంటలు బాగా పండాలని చర్చిలో ప్రార్థనలు

పుంగనూరు: పట్టణంలోని నాగపాళ్యం చర్చిలో క్రైస్తవులు ఆదివారం పాస్టర్ రాఖేష్‌ని వ్రైమోద్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాలు పడి పంటలు బాగా పండాలని, ప్రజలు సుఖశాంతులతో ఉండాలని, మణిపూర్‌లో అల్లర్లు సమసిపోవాలని ఏసుప్రభును ప్రార్థించామన్నారు. రవికుమార్, సురేష్ కిష్టఫర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు మండల సమావేశం

గుడుపల్లె: మండల ప్రజా పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం సోమవారం స్త్రీ శక్తి భవనంలో ఎంపీపీ వరలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో శ్రీనివాస్ తెలిపారు. మండలంలోని ప్రజా ప్రతినిధులు, అన్ని శాఖల అధికారులు తప్పక హాజరుకావాలని పేర్కొన్నారు.

డెయిరీ వద్ద ఏర్పాట్ల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న కమిషనర్ అరుణ

చిత్తూరు అర్బన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటన సందర్భంగా విజయ డెయిరీ వద్ద జరుగుతున్న ఏర్పాట్లను ఆదివారం నగర కమిషనర్ జె.అరుణ పర్యవేక్షించారు. డెయిరీ ఆవరణలో శిలాఫలకం వద్ద టైల్స్ ఏర్పాటు, ప్లాట్‌ఫామ్ నిర్మాణం, పరిసరాల వద్ద శుభ్రత పనులను తనిఖీ చేశారు. అధికారులకు పలు సూచనలు చేశారు. త్వరితగతిన పనులు పూర్తి చేయాలని ఆదేశించారు.

గరుడ వాహనంపై సీతారాములు



గరుడ వాహనంపై స్వామివారి విహారం

తవణంపల్లె: మండలంలోని టి.పుత్తూరు కోదండ రామస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి గరుడవాహన సేవను ఘనంగా నిర్వహించారు. తొలుత శ్రీరాముడి ఉత్సవమూర్తికి అభిషేకాది పూజలు నిర్వహించి ధూపదీప నైవేద్యం సమర్పించారు. అనంతరం గరుడ వాహనంపై అధిష్టించిన శ్రీరామచంద్రమూర్తి భక్తులను కటాక్షిస్తూ ముందుకు సాగారు. భక్తులు స్వామివారికి కొబ్బరికాయలు కొట్టి, కర్పూర, మంగళ హారతులు ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు.

● బాబు హయాంలో కలగానే..

ఏడు సార్లు శాసనసభ్యుడిగా, మూడు మార్లు ముఖ్యమంత్రిగా కొనసాగిన చంద్రబాబు సొంత నియోజక వర్గంలో పేదోడి సొంతింటి కల నెరవేర్చలేకపోయారు. 1996 నుంచి 2004 వరకు తొమ్మిదేళ్ల ముఖ్యమంత్రిగా ఉన్నా ఐదు మండలాలకు కేవలం 3,673 ఇండ్లు మాత్రమే ఇచ్చారు. అనంతరం 2014లో అధికారంలోకి వచ్చిన బాబు ఐదు సంవత్సరాల్లో కేవలం 4,761 గృహాలను ఎన్టీఆర్ గృహ కల్ప కింద మంజూరు చేసినట్లు రికార్డుల్లో ఉన్నా వాస్తవానికి పూర్తి అయ్యింది కేవలం 755 మాత్రమే. వీటిలో 2,528 ఇండ్లు మొండి గోడలకే పరిమితమయ్యాయి. సకాలంలో బిల్లులు, సామాగ్రి ఇవ్వక పోవడంతో నిర్మాణాలు ఆగిపోయాయి. ఎన్నికల సమయంలో ఎన్టీఆర్ గృహ కల్ప కింద ఇండ్లు మంజూరు చేసి పట్టాలు ఇచ్చి, స్థలాలు చూపకుండా ప్రజలను ఏమార్చారు.

● నేడు పేదల కళ్లలో ఆనందం

2019లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా అధికారం చేపట్టగానే ఇల్లు లేని పేదల కళ్లలో ఆనందం వెల్లివిరిసింది. నాలుగేళ్లలో కుప్పం నియోజక వర్గానికి 7,898 ఇండ్లు మంజూరు చేశారు. వీటిలో 2,940 ఇండ్లు పూర్తి చేసుకుని గృహ ప్రవేశాలకు సిద్ధమయ్యాయి. 6,649 ఇండ్లు వేగంగా నిర్మాణాలు జరుగుతున్నాయి. వివిధ కారణాల వల్ల 1,249 మంది లబ్ధిదారులు సొంతింటి పనులు ప్రారంభించలేదు. ప్రధానంగా కుప్పం మున్సిపాలిటీలో అద్దె ఇంట్లో ఉంటూ అద్దెలు కట్టలేక, సొంతింటి కల నెరవేరక 2,750 మంది ఆందోళన చెందేవారు. వీరందరికి జగనన్న రాకతో ఇండ్లు మంజూరు కావడంతో ఉత్సాహం నిర్మాణ పనులు చేసుకుంటున్నారు. తీరదన్న కల నెరవేరుతుండడంతో వారి ఆనందం మాటల్లో చెప్పలేకపోతున్నారు.

కుప్పంలో 63 గ్రామాల నిర్మాణం

అద్దె ఇంట్లో అవస్థలు పడుతూ..సొంతింటి కోసం ఏళ్ల తరబడి ఎదురు చూస్తున్న పేదోడి కల జగనన్న కాలనీలతో నేటికి సాకారమైంది. కుప్పానికి 35 ఏళ్లుగా ప్రాతినిథ్యం వహిస్తూ.. మూడు సార్లు సీఎంగా కొనసాగినా చంద్రబాబు నియోజక వర్గంలో పేదోడి సొంతి కల నెరవేర్చలేక పోయారు. ప్రజా సంకల్పయాత్రలో ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి కాగానే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదోడి సొంతింటి కలను నెరవేరుస్తున్నారు. కుప్పం నియోజక వర్గంలో నాలుగేళ్లలో 8 వేలమంది లబ్ధిదారులు సొంతింటికి యజమానులయ్యారు. ప్రస్తుతం 63 లేఅవుట్లలో వెలుస్తున్న గృహాలతో 63 గ్రామాల నిర్మాణం జరుగుతోంది. ఈనెల 30వ తేదీన గృహ ప్రవేశాలకు సిద్ధమవుతున్నాయి.



జగనన్న కాలనీలో నిర్మాణంలో ఉన్న ఇళ్లు



కాలనీలో సుందరంగా నిర్మించిన ఇల్లు

- పేదోడి సొంతింటి కల సాకారం
- గృహప్రవేశాలకు సిద్ధమవుతున్న 63 జగనన్న కాలనీలు
- బాబు హయాంలో దశాబ్దాలుగా అవస్థలు పడిన పేదవర్గాలు
- వైఎస్సార్ ప్రభుత్వంలో ఇంటి యజమానులైన బడుగులు

కుప్పం: కుప్పం నియోజక వర్గంలో సొంతింటి కల నెరవేరుతుండడంతో లబ్ధిదారుల మోములో ఆనందం వెల్లివిరుస్తోంది. దశాబ్దాలుగా సొంతింటి కోసం కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేసినా ప్రయోజనం లేక పోయింది. ఏడు సార్లు శాసనసభ్యుడిగా, మూడు మార్లు ముఖ్యమంత్రిగా కొనసాగిన చంద్రబాబు సొంత నియోజక వర్గంలో పేదోడి సొంతింటి కల నెరవేర్చలేకపోయారు. అద్దెలు చెల్లించలేక, ఉరుస్తున్న ఇళ్లలో పేదలు నానా బాధలు పడేవారు. ఎన్నికల సమయంలో మాత్రమే చంద్రబాబు పక్కా ఇళ్లు అంటూ ప్రకటనలు చేసి ఓట్లు వేసుకుంటూ శాసనసభ్యుడిగా గెలుపొందేవారు. నాయకులను నిలదీసే ధైర్యం కూడా లేక పేదవర్గాలవారు మౌనంగా ఉంటూ కాలం గడిపేవారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంకల్ప యాత్రలో ఇచ్చిన హామీ మేరకు అధికారంలోకి రాగానే పేదల సొంతింటి కలను నెరవేర్చేందుకు ఇంటి స్థలం కేటాయించి, కాలనీలను నిర్మించి ఇస్తున్నారు. కుప్పం నియోజకవర్గంలో ఇళ్లు లేని పేదలకు 63 లేఅవుట్ల నిర్మాణం చేపట్టారు. స్థలాలు లేక, ఇండ్లు నిర్మించుకునే స్తోమత లేని పేదలకు ప్రభుత్వం స్థలం కేటాయించి కాలనీ గృహాలు మంజూరు చేసింది. ఇందులో భాగంగా పంచాయతీ కేంద్ర సమీపంలోని ప్రభుత్వ స్థలాలను గుర్తించి లే అవుట్లుగా మార్చి జగనన్న కాలనీలుగా రూపుదిద్దారు. తద్వారా 63 లేఅవుట్లలో వెలుస్తున్న గృహాలతో 63 గ్రామాల నిర్మాణం జరుగుతోంది. ప్రస్తుతం ఇండ్ల నిర్మాణం పూర్తి దశకు చేరుకోవడంతో ఈనెల 30వ తేదీన గృహ ప్రవేశాలకు సిద్ధమవుతున్నాయి. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి హామీని నెరవేర్చడంతో గత చంద్రబాబు ప్రభుత్వం, నేటి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పనితీరును పేదవర్గాలు బేరీజు వేసుకుంటున్నాయి. ఇన్నాళ్లూ చంద్రబాబు మోసపు మాటలు నమ్మి దగా పడ్డామని, ఇచ్చిన హామీ నెరవేర్చిన సీఎం జగనన్న మేలు తామెప్పుడు మరచిపోమని స్పష్టం చేస్తున్నారు.

సొంతింటికి యజమాని అయ్యా



దశాబ్దాల సొంతింటి కల నెరవేరింది. గతంలో అద్దె భవనంలో ఉంటూ జీవనం సాగించేవారం. గత ప్రభుత్వంలో కాలనీ ఇంటి కోసం తిరిగినా ప్రయోజనం లేకపోయింది. జగనన్న వచ్చిన తరువాత దరఖాస్తు చేసుకున్న వెంటనే వలంటీర్ ఇల్లు మంజూరైందని పత్రాలు తీసుకు వచ్చి ఇచ్చాడు. పలార్లపల్లె వద్ద జగనన్న కాలనీలో ఇల్లు కట్టుకుని ఏడాదిగా జీవిస్తున్నాం. –అఖిల, పలార్లపల్లె, జగనన్న కాలనీ వాసి

ఆనందం మాటల్లో చెప్పలేం



సొంతిల్లు కట్టుకుంటామో లేదో అనే అనుమానం ఉండేది. టీడీపీ ప్రభుత్వ హయాంలో ఎన్నిమార్లు దరఖాస్తు చేసుకున్నా రాలేదు. జగన్‌మోహన్‌రెడ్డి రాకతో దరఖాస్తు చేసుకోగానే లిస్టులో నా పేరు వచ్చింది. అధికారులు సకాలంలో బిల్లులు, గృహ నిర్మాణ సామాగ్రి అందజేయడంతో ఇంటి నిర్మాణం సాధ్యమైంది. ఇప్పుడు ఆనందంగా ఉంది. ఆ ఆనందం మాటల్లో చెప్పలేం. –గిరిజా, పలార్లపల్లె, జగనన్న కాలనీ వాసి

జగనన్న రుణం తీర్చుకోలేనిది



కూలికి వెళ్తె గానీ పొట్టగడవడం కష్టం. అలాంటి మాకు సొంతిల్లు అనేది కలే. అద్దెలు కట్టలేక చాలా ఇబ్బందులు పడేవారం. జగనన్న రాకతో మాకు ఇల్లు వచ్చింది. మాకు నచ్చినట్లు ఇల్లు కట్టుకున్నాం. జగనన్న రుణం ఎప్పటికీ తీర్చుకోలేనిది. –హేమలత, కుప్పం వాసి

బాలాజీకి సన్మానం



బాలాజీని సన్మానిస్తున్న సంఘం నాయకులు

పలమనేరు: ఏపీ ఎన్జీవోల సంఘం కార్యదర్శి, స్థానిక వైద్యశాఖ ఉద్యోగి సీకే బాలాజీ సేవలు శ్లాఘనీయమని సంఘం అధ్యక్షుడు ఆనందబాబు తెలిపారు. స్థానిక సంఘ కార్యాలయంలో ఆదివారం బదిలీ అయిన ఆయనను సంఘం ఆధ్వర్యంలో సత్కరించి సేవలను కొనియాడారు. కర్నూలులో వరదలు, కోవిడ్, సమైఖ్యాంధ్ర ఉద్యమాల్లో ఆయన చేసిన సేవలను మరవలేమని పేర్కొన్నారు. పలమనేరు పరిరక్షణ సమితి నాయకులు సుబ్రమణ్యం పిళ్లై, కార్యదర్శి నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా ద్రౌపదీ కల్యాణం

సదుం: మండలంలోని భట్టువారిపల్లెలో భారతం మిట్ట వద్ద పెద్దిరెడ్డి భాస్కర్‌రెడ్డి ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మహాభారత యజ్ఞంలో భాగంగా ఆదివారం సాయంత్రం ద్రౌపదీ కల్యాణం వైభవంగా నిర్వహించారు. కంకణధారులైన పెద్దిరెడ్డి వేణుగోపాల్‌రెడ్డి దంపతుల ఆధ్వర్యంలో తొలుత పాండవుల విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కల్యాణోత్సవం అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. జోత్స్న హరికథా గానం, రాత్రి నాటక ప్రదర్శన అలరించింది. మాజీ ఎంపీపీ పెద్దిరెడ్డి ఇందిరమ్మ, ఎంపీపీ ఎల్లప్ప, సీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ చైర్మన్ కృష్ణారెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ శివారెడ్డి, నాగభూషణంరెడ్డి, రామాంజులు పాల్గొన్నారు.

సదుం విద్యార్థి ప్రతిభ



సాత్విక్ రెడ్డి

సదుం: బిట్స్ పిలానీ, ఎన్ఐటీ ఫలితాల్లో మండల విద్యార్థి ప్రతిభ చాటాడు. జాంద్రపేటకు చెందిన మోహన్‌రెడ్డి, సరళ దంపతులు ప్రభుత్వ ఉపాధ్యాయులుగా పని చేస్తున్నారు. వీరి కుమారుడు సాత్విక్ రెడ్డి బిట్స్ పిలానీ ప్రవేశ పరీక్షలో కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ సీటు సాధించాడు. జేఈఈ మెయిన్స్‌లోను 99.1 పెర్సెంటైల్‌తో నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో బ్యాచిలర్ ఆఫ్ కంప్యూటర్ సైన్స్ కోర్సు అడ్మిషన్ సాధించాడు. ఈసందర్భంగా విద్యార్థిని పలువురు అభినందించారు.

అన్ని వర్గాల అభ్యున్నతే లక్ష్యం



రామాపురంలో లబ్ధిదారులకు పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ

వి.కోట: అన్ని వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే వెంకటేగౌడ తెలిపారు. ఆదివారం మండలంలోని నెర్నిపల్లె పంచాయతీ సచివాలయ పరిధిలోని రామాపురంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో అధికారులతో కలసి ఎమ్మెల్యే పాల్గొన్నారు. గ్రామంలో 160 గడపలను సందర్శించి పథకాలను వివరించి, సంక్షేమ బావుటా బుక్‌లెట్‌ను అందించారు. సమస్యలైనా ఉన్నాయా..? తాగునీరు, పింఛన్ల పంపిణీలో లోటుపాట్లు ఏవైనా ఉన్నాయా..? అని అడిగారు. ప్రజలు మాట్లాడుతూ తమకు ఎటువంటి సమస్యలు లేవని, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ పింఛన్, జగనన్న చేదోడు, జగనన్న చేయూత, విద్యాదీవెన, అమ్మఒడి వంటి పథకాలతో ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నట్లు హర్షం వ్యక్తం చేశారు. వీధిలైట్లు, కాలువలు తదితర చిన్నపాటి సమస్యలను తక్షణం పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అధికారులతో మాట్లాడుతూ జగనన్న సురక్ష పథకం కింద అందే దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి సారించి సమస్యలు లేని గ్రామాలుగా తీర్చిదిద్దాలని సూచించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి ఆదర్శ మండలంగా తీర్చిదిద్దాలని సూచించారు.

కులం,మతం, పార్టీలతో పనిలేదు

గత చంద్రబాబు ప్రభుత్వంలో జన్మభూమి కమిటీల పేరుతో ఆపార్టీ నాయకులు మాత్రమే లబ్ధి పొందారని, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి కుల, మత, రాజకీయాలకు అతీతంగా ప్రభుత్వ పథకాలను అందజేస్తున్నట్లు ఎమ్మెల్యే వెంకటేగౌడ తెలిపారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలకు మించి ముఖ్యమంత్రి అభివృద్ధి పథకాలను అమలు చేశారని పేర్కొన్నారు. తమ ప్రభుత్వానికి ప్రజల నుంచి వస్తున్న ఆదరణ చూడలేక ప్రతిపక్ష నాయకులు, ఎల్లో మీడియా అవాస్తవాలతో బురదజల్లుతున్నట్లు ఆరోపించారు. చంద్రబాబుకు కుట్ర రాజకీయాలు వెన్నతోపెట్టిన విద్య అని విమర్శించారు. ఎంపీపీ యువరాజు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ బాలగురునాథ్, వైస్ ఎంపీపీ లక్ష్మణ్‌రెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మెన్ ఆంజినేయులు, ఎంపీటీసీ సభ్యురాలు యశోదమ్మ, కోఆప్షన్ మెంబర్ జాబిఉల్లా, పార్టీ మహిళా విభాగం మండల అధ్యక్షురాలు శశికళ, పంచాయతీ కన్వీనర్ సత్యమూర్తి, రెస్కో డైరెక్టర్ భూపతి, నాయకులు ప్రకాష్, బర్కత్, రామకృష్ణ, కుమార్‌రాజా, సోషల్ మీడియా నియోజకవర్గ ఇన్‌చార్జి ఉదయ్, తహసీల్దార్ చిట్టిబాబు పాల్గొన్నారు.

కాణిపాకానికి ఐదు టన్నుల కూరగాయలు

పలమనేరు: కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానానికి ఆడిమాసం పౌర్ణమి సందర్భంగా ఆదివారం స్థానిక శ్రీవారి సేవకులు ఐదుటన్నుల కూరగాయలను ఆలయానికి పంపారు. దాతల సహకారంతో వీటిని సేకరించి ఆలయానికి పంపినట్టు నిర్వాహకుడు రవీంద్రారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో సోమశేఖర్ నాయుడు, మోహన్‌రెడ్డి, బాబు పాల్గొన్నారు.

ముగిసిన పవిత్రోత్సవాలు

తిరుపతి కల్చరల్: కపిలేశ్వరస్వామి ఆలయంలో మూడు రోజులుగా నిర్వహించిన పవిత్రోత్సవాలు ఆదివారం మహా పూర్ణాహుతితో ఘనంగా ముగిశాయి. ఇందులో భాగంగా ఉదయం యాగశాలపూజ, హోమం, మహాపూర్ణాహుతి, కలశోద్వాసన, మూలవర్లకు కలశాభిషేకం, పట్టు పవిత్ర సమర్పణ చేపట్టారు.

తప్పిన పెను ప్రమాదం



మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

పలమనేరు: పట్టణంలోని చెన్నై–బెంగళూరు జాతీయ రహదారి సమీపంలో విష్ణుప్రియ హోటల్ వెనుక ఆదివారం చెత్తకు నిప్పుపెట్టడంతో పక్కనే ఉన్న మరో గృహంలో మంటలు వ్యాపించాయి. గమనించిన స్థానికులు ఫైర్ కార్యాలయానికి సమాచారం అందించారు. హుటాహుటిన అక్కడికి చేరుకున్న ఫైర్ సిబ్బంది మంటలను అదుపుచేసి పెను ప్రమాదాన్ని తప్పించారు.

గ్రామీణాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి



సీసీ రోడ్ల పనులను పరిశీలిస్తున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

వి.కోట: గ్రామ స్థాయి నుంచి అభివృద్ధి జరిగితేనే రాష్ట్రం బాగుంటుందని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి గ్రామీణాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు అన్నారు. ఆదివారం మండలంలోని రామాపురంలో ప్రభుత్వం నూతనంగా చేపడుతున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా సీసీ రోడ్ల నిర్మాణ పనుల వద్ద నెలకొన్న చిన్నపాటి సమస్యలను గ్రామస్తులు జెడ్పీ చైర్మెన్ వద్దకు తీసుకొచ్చారు. అభివృద్ధి జరగాలంటే గ్రామస్తులు సహకరించాలని, చిన్నపాటి సమస్యలు ఎదుర్కో తప్పదని వారికి నచ్చచెప్పి సమస్యను పరిష్కరించారు. దీంతో పనులు యథావిధిగా కొనసాగించారు. పంచాయతీ అధికారులు పాల్గొన్నారు.

శరీరం సహకరించదు.. పనిచేస్తే అలసట

- అత్యంత అరుదైన మయస్తీనియా గ్రేవిస్ వ్యాధి
- వేధిస్తున్న కండరాల బలహీనం

కొద్ది దూరం నడిస్తే శరీరం సహకరించదు. కొద్దిసేపటికే తీవ్ర అలసట వస్తుంది. మెట్లు ఎక్కలాంటే నరకమే. కనురెప్పలు వాలి పోతుంటాయి. దృష్టి రెండుగా కనిపిస్తుంది. ఆహారాన్ని కూడా సరిగ్గా నమలలేని పరిస్థితి. ఇవన్నీ అరుదైన మయస్తీనియా గ్రేవిస్ వ్యాధి లక్షణాలు. ఇటీవల కాలంలో పలువురిలో ఈ లక్షణాలు కనిపిస్తున్నాయి.



చిత్తూరు జిల్లా ఆస్పత్రిలో క్యూలో ఉన్న రోగులు

చిత్తూరు రూరల్: జిల్లాలో మయస్తీనియా గ్రేవిస్‌తో బాధపడే వారి సంఖ్య చాలా అరుదుగా కనిపిస్తుంది. చాలా మంది ఈ వ్యాధితో బాధపడుతున్నా వారికి ఈ వ్యాధి ఉన్నట్లు కూడా అవగాహన ఉండదు. ఈ వ్యాధిపై చాలా మంది వైద్యులకు కూడా సరైన అవగాహన లేకపోవడంతో లక్షణాలను బట్టి చికిత్స ఇస్తున్నారు. నిపుణులైన వైద్యులు మాత్రమే ఇలాంటి అరుదైన వ్యాధులను గుర్తించి చికిత్స అందించే అవకాశం ఉంది. జిల్లాలో ఈ వ్యాధితో 1,500 దాకా ఉన్నట్లు అంచనా. ప్రతి లక్ష మందిలో 40 నుంచి 50 మంది దాకా ఈ వ్యాధితో బాధపడుతున్నట్లు వైద్యులు చెబుతున్నారు.

మయస్తీనియా గ్రేవిస్ అంటే..

కండరాలు బలహీనంగా, సులభంగా అలసిపోయేలా చేసే వైద్య పరిస్థితినే మయస్తీనియాగా పిలుస్తారు. ఇది కండరాలు, నాడుల మధ్య సంబంధాన్ని దెబ్బతీసి నియంత్రణను కోల్పోయేటట్లు చేస్తుంది. భోజనం మధ్యలో ఉన్నప్పుడు మీ దవడ కండరాలు అలసిపోవడం, బలహీనపడడం వంటి సమస్య కనిపిస్తుంది. ఆహారాన్ని నమలడం కష్టమవుతుంది. కొద్దిసేపు విశ్రాంతి తీసుకున్న తర్వాత కండరాలు మళ్లీ బలపడతాయి. అప్పుడు మళ్లీ మీరు తినవచ్చు. కండరాలు ఇలా బలహీనపడడం, విశ్రాంతితో మెరుగుపడడం, ఉపయోగంతో మరింత క్షీణించడం వంటివి మయస్తీనియా గ్రేవిస్‌లోని సంకేతాలు. ఈ వ్యాధితో బాధపడేవారిలో ఈ లక్షణాలు అధ్వానంగా మారే సమయాలను గుర్తించవచ్చు. కొన్నిసార్లు ఈ లక్షణాలు తగ్గవచ్చు లేదా అదృశ్యం కావచ్చు. ఈ వ్యాధి ఏ వయస్సు వారికైనా రావచ్చు. కానీ 40 ఏళ్ల కంటే తక్కువ వయస్సున్న మహిళలు, 60 ఏళ్ల కంటే ఎక్కువ వయస్సున్న పురుషులకు ఎక్కువగా వస్తుంది.


వ్యాధి లక్షణాలు

- కొద్దిదూరం నడిస్తే శరీరం సహకరించదు. మెట్లు ఎక్కడానికి కూడా ఇబ్బంది పడతారు.
- దాదాపు 50 శాతం మయస్తీనియా గ్రేవిస్ కేసుల్లో మొదటి సంకేతాలు, లక్షణాలు కంటి కండరాల్లో కనిపిస్తాయి. కొన్నిసార్లు ఒకటి లేదా రెండు కనుబొమ్మలు వాలిపోతాయి. మరికొందరికి దృష్టి రెండుగా కనిపిస్తుంది.
- 15 శాతం కేసుల్లో ముఖం, గొంతు కండరాలపై ప్రభావం చూపుతుంది. బలహీనంగా మాట్లాడడం .. మాట విభిన్నంగా ఉండడం, నమలడం, మింగడం, తాగడం, తినడం కష్టంగా మారుతుంది.
- కొన్నిసార్లు మీరు మింగేందుకు ప్రయత్నించే ద్రవాలు ముక్కు నుంచి బయటకు రావచ్చు. కొన్నిసార్లు ముఖకవళికలు భిన్నంగా కనిపించడానికి కారణం కావచ్చు.

నిర్ధారణ పరీక్షలు

రోగి కండరాల స్థాయి, స్పర్శ, ప్రతిచర్య, సమన్వయం, కండరాల బలం, సమతుల్యతను పరీక్షించడం ద్వారా నరాల ఆరోగ్యాన్ని వైద్యులు పరిశీలిస్తారు. అసాధారణ యాంటిబాడీస్‌ను గుర్తించేందుకు రక్త పరీక్ష చేస్తారు.

ముందు జాగ్రత్తతోనే నివారణ



మయస్తీనియా గ్రేవిస్‌ను తొలి దశలోనే గుర్తిస్తే మంచిది. అవగాహన లేమితో చాలా మంది ఇష్టానుసారంగా మందులు వాడుతున్నారు. ఇది మంచిది కాదు. డాక్టరు సూచనలు, సలహాలు తీసుకుని మందులు వాడాలి. లేని పక్షంలో వ్యాధి మరింత బలపడే అవకావం ఉంటుంది. ముందుగా ఈ వ్యాధిని గుర్తిస్తే నియంత్రణ సులభమవుతుంది.

–డాక్టర్ అరుణ్‌కుమార్, సూపరింటెండెంట్, చిత్తూరు

నేడు గురుపూర్ణిమ వేడుకలు





పుంగనూరు: మాదనపల్లెలో విశేషాలంకరణలో బాబా, చౌడేపల్లె : పూజల్లో పాల్గొన్న వాసవీ వనితా క్లబ్ ప్రతినిధులు

పుంగనూరు: గురుపౌర్ణమి వేడుకలకు పట్టణంలోని శ్రీషిర్డీ సాయిబాబా ఆలయాలు ముస్తాబయ్యాయి. సోమవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. పట్టణంలోని కొత్తయిండ్లు, కట్టపైన వెలసిన శ్రీసాయిబాబా ఆలయంలో విశేష పూజలు, హోమాలు చేయనున్నారు. మాదనపల్లెలో వెలసియున్న శ్రీబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు చేయనున్నారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని నిర్వాహకులు ఏర్పాట్లు చేపట్టారు. మాదనపల్లె బాబా ఆలయంలో ఆదివారం విశేష పూజలు జరిగాయి.

భక్తుల స్వహస్తాలతో పాలాభిషేకం

రామకుప్పం: మండలకేంద్రంలోని సాయిబాబా ఆలయంలో సోమవారం గురుపౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉదయం పంచామృత అభిషేక సేవ, బాబా ఉత్సవమూర్తికి భక్తుల స్వహస్తాలతో పాలాభిషేకం, మధ్యాహ్నం మహా మంగళహారతి, అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు. బాబా సేవలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

సదుం మండలంలో..

సదుం: మండలంలోని గాంధీరోడ్డులో వెలసి ఉన్న శ్రీసాయి మందిరంలో గురుపౌర్ణమి వేడుకలు సోమవారం నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. ప్రత్యేక అభిషేక పూజలు, భజనలు ఉంటాయని పేర్కొన్నారు. మధ్యాహ్నం అన్నదానం ఏర్పాటు చేసినట్టు తెలిపారు. భక్తులు పాల్గొనాలని కోరారు.

108 సుగంధ ద్రవ్యాలతో అభిషేకం

చౌడేపల్లె: మండలకేంద్రంలోని బజారువీధిలో వెలసిన శ్రీ షిర్డిసాయిబాబా ఆలయంలో గురుపౌర్ణమి వేడుకల్లో భాగంగా ఆదివారం విశేష అభిషేక పూజలు జరిగాయి. వాసవీ, వనిత క్లబ్ ప్రతినిధులు ఇస్నా నాగలక్ష్మి, రామ్మోహన్ ఆధ్వర్యంలో 108 సుగంధ ద్రవ్యాలతో అభిషేకం చేశారు. అనంతరం బాబాను సర్వాంగ సుందరంగా అలంకరించి వెండి సింహాసనంపై కొలువుదీర్చి పూజలు చేశారు. కళాకారుల నృత్యాలు, భక్తుల సంకీర్తనల ఆలాపనలతో ఆలయ పరిసరాలు మార్మోగాయి. భక్తులు పెద్ద సంఖ్యల పాల్గొని సాయిబాబాను దర్శించుకుని తన్మయులయ్యారు.